TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 39 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ మంగళవారం | మే 19, 2026

# ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు..



- ప్రతి జిల్లాలో పూర్తిస్థాయి 'యానిమల్ బర్త్ కంట్రోల్' కేంద్రాలు ఏర్పాటు చేయాలి

2లో..

- వీధికుక్కల బెడదను రూపుమాపాల్సిందే
- సుప్రీంకోర్టు
- స్కూళ్లు, కాలేజీలు, బస్టాండ్లలో కుక్కలు లేకుండా చూడాలి
- జంతు సంక్షేమ బోర్డు పిటిషన్లను కొట్టివేస్తూ అత్యున్నత న్యాయస్థానం సంచలన తీర్పు

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్:**

దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న వీధికుక్కల బెడదపై సుప్రీంకోర్టు మంగళవారం అత్యంత కీలకమైన తీర్పును వెలువరించింది. వీధికుక్కల బెడదను రూపుమాపాల్సిందేనని, ఈ విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇది నేరుగా ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన అంశమని పేర్కొంది. బహిరంగ ప్రదేశాల నుండి వీధి కుక్కలను తొలగించాలంటూ గతంలో తాము జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని లేదా సవరించాలని కోరుతూ జంతు ప్రేమికులు, జంతు సంక్షేమ బోర్డు దాఖలు చేసిన అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు ఈ సందర్భంగా పూర్తిగా కొట్టివేసింది.

# అదానీకి బిగ్ రిలీఫ్

- అమెరికాలో కేసులు కొట్టివేత
- ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని తేల్చిన న్యాయశాఖ
- లంచాల ఆరోపణలపై విచారణకు తెర..
- జరిమానాతో వివాదాల పరిష్కారం



2లో..

# ఆదిలాబాద్‌లో నిప్పుల కుంపటి

- 44.6 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత!
- వడగాలుల తీవ్రతకు అల్లాడుతున్న జనం
- అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక

4లో..



# అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం

- శాండియాగో ఇస్లామిక్ సెంటర్‌లో ముగ్గురు మృతి
- మసీదు, పాఠశాల ఉన్న సముదాయంలో దుండగుల అటాక్
- దాడి అనంతరం నిందితులుగా భావిస్తున్న ఇద్దరు యువకులు ఆత్మహత్య?
- జాతి విద్వేష కోణంలో పోలీసులతో పాటు ఎఫ్‌బీఐ రంగంలోకి



2లో..

# ఎబోలాపై భారత్ తీవ్ర అప్రమత్తం



2లో..

- పటిష్ట నిఘా పెట్టిన కేంద్ర ఆరోగ్య శాఖ
- ఆఫ్రికా దేశాల్లో వేగంగా విస్తరిస్తున్న ప్రాణాంతక వైరస్..
- ఇప్పటికే 100 మంది మృతి
- దేశంలోకి వైరస్ ప్రవేశించకుండా 'ఎన్‌సీడీసీ' నిశిత పరిశీలన
- ప్రస్తుతానికి ముప్పు తక్కువే.. ఆందోళన వద్దు: ఎయిమ్స్ నిపుణులు



4లో..

- యూపీలో భారీ నెట్‌వర్క్ ఛేదించిన పోలీసులు
- నాసిక్ ఘటన మరువక ముందే మిర్జాపూర్‌లో మరో దారుణం వెలుగులోకి
- జిమ్‌లు, ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మహిళలే లక్ష్యంగా వల..
- 10 మంది నిందితుల అరెస్ట్
- చర్యలకు సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశం

# చాపకింద నీరులా మతమార్పిళ్ల దందా

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
మంగళవారం, మే 19, 2026

# అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం

### శాండియాగో ఇస్లామిక్ సెంటర్‌లో ముగ్గురు మృతి

**శాన్ డియాగో, వాయిస్ ఆఫ్ వందే భారత్:** అమెరికాలో గన్ కల్చర్ మరోసారి పడగవిప్పింది. దక్షిణ కాలిఫోర్నియా పరిధిలోని శాన్ డియాగోలో ఉన్న ఒక ప్రముఖ ఇస్లామిక్ సెంటర్‌లో సోమవారం జరిగిన ఘోర కాల్పుల ఘటనలో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. మసీదుతో పాటు ఇస్లామిక్ పాఠశాల కూడా ఉన్న ఒకే సముదాయంలో ఈ ఘాతుకం చోటుచేసుకుంది. ఈ దాడి వెనుక జాతి వివక్ష, మతపరమైన ద్వేషం దాగి ఉండవచ్చని భద్రతా దళాలు ప్రాథమికంగా అనుమానిస్తున్నాయి. కాల్పుల అనంతరం దాడికి పాల్పడినట్లు భావిస్తున్న ఇద్దరు యువకులు కూడా తీవ్ర తుపాకీ గాయాలతో ఘటనా స్థలంలోనే మృతి చెంది ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. వారు ఇస్లామిక్ సెంటర్‌పై దాడి చేసిన అనంతరం తమను తామే కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని శాన్ డియాగో పోలీస్ చీఫ్ స్కాట్ వాల్ వెల్లడించారు. దుండగుల వయసు 17 నుంచి 19 ఏళ్ల మధ్య ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. మరణించిన ముగ్గురిలో ఒకరు ఇస్లామిక్ సెంటర్ భద్రతా సిబ్బంది అని పోలీసులు తెలిపారు. దుండగులు లోపలికి ప్రవేశించకుండా ఆయన సమయానికి అడ్డుకోవడంతోనే లోపల ఉన్న పాఠశాల విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాలేదని, ఒక భారీ ప్రమాదం తప్పిందని పోలీస్ చీఫ్ పేర్కొన్నారు. మరణించిన ముగ్గురూ పెద్దవారేనని స్పష్టం చేశారు. ఈ ఘాతుకంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇదొక అత్యంత భయంకరమైన, దారుణమైన ఘటన అని ఆయన అభివర్ణించారు. కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్, యూఎస్ కాంగ్రెస్ సభ్యురాలు సారా జాకబ్స్ ఈ దాడిని తీవ్ర పదజాలంతో ఖండించారు. శాన్ డియాగో మేయర్ టాడ్ గ్లోరియా మాట్లాడుతూ.. నగరంలో జాతి విద్వేషాలకు తావులేదని, ముస్లిం సమాజ భద్రతకు తాము పూర్తి హామీ ఇస్తున్నామని ప్రకటించారు. కాగా, ఈ ఘటనపై స్థానిక పోలీసులతో కలిసి అమెరికా నిఘా సంస్థ 'ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్' కూడా రంగంలోకి దిగిందని ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ వెల్లడించారు. కాగా, శాన్ డియాగో కాల్పుల నేపథ్యంలో అప్రమత్తమైన భద్రతా దళాలు న్యూయార్క్‌లోని ప్రధాన మసీదులు, ఇస్లామిక్ కేంద్రాల వద్ద భద్రతను పటిష్టం చేశాయి.

# ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు..

- వీధికుక్కల బెడదను రూపుమాపాల్సిందే
- సుప్రీంకోర్టు
- స్కూళ్లు, కాలేజీలు, బస్టాండ్లలో కుక్కలు లేకుండా చూడాలి
- ప్రతి జిల్లాలో పూర్తిస్థాయి 'యానిమల్ బర్త్ కంట్రోల్' కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- జంతు సంక్షేమ బోర్డు పిటిషన్లను కొట్టివేస్తూ అత్యున్నత న్యాయస్థానం సంచలన తీర్పు

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్:** దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న వీధికుక్కల బెడదపై సుప్రీంకోర్టు మంగళవారం అత్యంత కీలకమైన తీర్పును వెలువరించింది. వీధికుక్కల బెడదను రూపుమాపాల్సిందేనని, ఈ విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇది నేరుగా ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన అంశమని పేర్కొంది. బహిరంగ ప్రదేశాల నుండి వీధి కుక్కలను తొలగించాలంటూ గతంలో తాము జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని లేదా సవరించాలని కోరుతూ జంతు ప్రేమికులు, జంతు సంక్షేమ బోర్డు దాఖలు చేసిన అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు ఈ సందర్భంగా పూర్తిగా కొట్టివేసింది.

### ప్రజల భద్రతే ముఖ్యం..

పాఠశాలలు, కళాశాలలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు తదితర బహిరంగ ప్రదేశాల్లో కుక్కలను తొలగించాలన్న గత ఉత్తర్వులపై దాఖలైన పిటిషన్లను విచారించిన ధర్మాసనం.. వీధి కుక్కల సమస్యను కేవలం జంతు సంక్షేమ కోణంలోనే కాకుండా, ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన తీవ్రమైన అంశంగా పరిగణించాలని పిటిషనర్లకు గట్టిగా స్పష్టం చేసింది. 'యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా' రూపొందించిన నియమావళిని సమర్థవంతంగా అమలు చేయడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే రంగంలోకి దిగాలని ఆదేశించింది.



### సుప్రీంకోర్టు జారీ చేసిన కీలక ఆదేశాలు:

బర్త్ కంట్రోల్ కేంద్రాలు: దేశంలోని ప్రతి జిల్లాలో కనీసం ఒక పూర్తి స్థాయి 'యానిమల్ బర్త్ కంట్రోల్' (సంతానోత్పత్తి నియంత్రణ) కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. స్థానిక కుక్కల జనాభాను దృష్టిలో ఉంచుకొని అవసరమైతే ఈ కేంద్రాల సంఖ్యను మరిన్ని పెంచాలి. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని స్కూళ్లు, కాలేజీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లతో పాటు రద్దీగా ఉండే ఇతర ప్రజా బాహుళ్య ప్రాంతాల్లో కుక్కల సంచారం లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి. దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ యాంటీ రేబిస్ (కుక్క కాటు) మందులు, ఇంజక్షన్లు నిరంతరం అందుబాటులో ఉండేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యవేక్షించాలి. రేబిస్ వ్యాధి బారిన పడిన లేదా మానవుల ప్రాణాలకు ముప్పుగా పరిణమించేలా అత్యంత ప్రమాదకరంగా మారిన కుక్కల విషయంలో.. చట్టబద్ధంగా అనుమతించిన ఏవైనా కఠిన చర్యలు తీసుకోవచ్చని కోర్టు స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల అమలు కోసం క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే మున్సిపల్, పంచాయతీ ఉద్యోగులకు ప్రభుత్వాలు తగిన రక్షణ కల్పించాలని, విధి నిర్వహణలో ఉన్న వారిపై ఎలాంటి బలవంతపు చర్యలు లేదా దాడులు జరగకుండా చూడాలని ఆదేశించింది.

### జాతీయ రహదారులపై ప్రత్యేక మానిటరింగ్

రహదారులపై ఇష్టారాజ్యంగా సంచరించే పశువుల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాను సుప్రీంకోర్టు ఆదేశించింది. జాతీయ రహదారులపై తిరిగే జంతువుల వల్ల జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు, వాటిని పర్యవేక్షించేందుకు వీలుగా తక్షణమే ఒక 'ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థ'ను ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్‌ఏఐకి కోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది.

# ఎబోలాపై భారత్ తీవ్ర అప్రమత్తం

- పటిష్ట నిఘా పెట్టిన కేంద్ర ఆరోగ్య శాఖ
- ఆఫ్రికా దేశాల్లో వేగంగా విస్తరిస్తున్న ప్రాణాంతక వైరస్..
- ఇప్పటికే 100 మంది మృతి
- దేశంలోకి వైరస్ ప్రవేశించకుండా 'ఎన్‌సీడీసీ' నిశిత పరిశీలన
- ప్రస్తుతానికి ముప్పు తక్కువే.. ఆందోళన వద్దు: ఎయిమ్స్ నిపుణులు

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఆఫ్రికా ఖండంలోని డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా సహా పలు దేశాల్లో ప్రాణాంతక 'ఎబోలా' వైరస్ వేగంగా విజృంభిస్తున్న నేపథ్యంలో భారత ప్రభుత్వం తీవ్ర అప్రమత్తమైంది. ఆయా దేశాల్లో ఈ మహమ్మారి కారణంగా ఇప్పటికే 100 మందికి పైగా మరణించగా, మరో 390 అనుమానిత కేసులు నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. కాంగోలో విధులు నిర్వహిస్తున్న ఆరుగురు అమెరికన్లకు కూడా ఈ వ్యాధి సోకినట్లు నిర్ధారణ కావడంతో, వారిని క్వారంటైన్ నిమిత్తం సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అమెరికా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. అంతర్జాతీయంగా ఎబోలా విస్తరిస్తున్న ఈ పరిస్థితుల్లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా నివారణ చర్యలపై దృష్టి సారించింది.

### అంతర్జాతీయ విమానాశ్రయాలపై ప్రత్యేక నిఘా

ఎబోలా వ్యాప్తిని జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం (NCDC) నిశితంగా గమనిస్తోందని, దేశంలోకి ఈ




ప్రాణాంతక వైరస్ ప్రవేశించకుండా విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం భారతదేశంలో ఎలాంటి ఎబోలా కేసులు నమోదు కాలేదని స్పష్టం చేసింది. అయితే, అంతర్జాతీయ ప్రయాణాలు, ప్రపంచవ్యాప్త రవాణా అనుసంధానం (గ్లోబల్ కనెక్టివిటీ) ఎక్కువగా ఉన్న కారణంగా.. ఇలాంటి అంతర్జాతీయ అంటువ్యాధుల ముప్పు పట్ల భారత్ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

### ఆందోళన చెందాల్సిన అవసరం లేదు: ఎయిమ్స్ ప్రొఫెసర్

ఈ ఎబోలా వైరస్ వ్యాప్తిపై ఢిల్లీలోని ఎయిమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సంజయ్ రాయ్ మాట్లాడుతూ.. ప్రస్తుతానికి భారతదేశానికి ఎబోలా ముప్పు చాలా తక్కువగా ఉందని స్పష్టం చేశారు. దేశంలో నిఘా వ్యవస్థ బలంగా ఉందని, ఈ వ్యాధి వ్యాప్తిపై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. అయితే విదేశీ ప్రయాణాలు చేసే వారు, ముఖ్యంగా ఆఫ్రికా దేశాలకు వెళ్లి వచ్చే వారు తగిన ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని అధికారులు హెచ్చరించారు.

# అదానీకి బిగ్ రిలీఫ్

- అమెరికాలో కేసులు కొట్టివేత
- ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని తేల్చిన న్యాయశాఖ
- లంచాల ఆరోపణలపై విచారణకు తెర..
- జరిమానాతో వివాదాల పరిష్కారం

**న్యూయార్క్, వాయిస్ ఆఫ్ వందే భారత్:** భారతీయ పారిశ్రామిక దిగ్గజం, అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీలకు అమెరికాలో భారీ ఉపశమనం లభించింది. వారిపై నమోదైన పలు సంచలన కేసులను అమెరికా న్యాయ శాఖతో పాటు 'యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్' సహా ఇతర దర్యాప్తు ఏజెన్సీలు పూర్తిగా కొట్టివేసాయి. ఈ కేసుల్లో మోపబడిన ఆరోపణలకు సంబంధించి ఎలాంటి పక్కా ఆధారాలు లేవని, లంచాలు ఇచ్చినట్లుగా కూడా తగిన రుజువులు లభించలేదని అమెరికా న్యాయశాఖ స్పష్టం చేసింది. అమెరికాలో ఇటువంటి ఉన్నత స్థాయి ఆరోపణలను పూర్తిగా కొట్టివేయడం ఒక అసాధారణ చర్య అని అంతర్జాతీయ న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారతదేశంలో ఒక భారీ సోలార్ పవర్ అమ్మకాల కాంట్రాక్టును దక్కించుకోవడానికి రూ. 2,000 కోట్లకు పైగా లంచాలు ఇచ్చారని, అలాగే పలు విదేశీ నిధుల సమీకరణ దశల్లో అమెరికన్ పెట్టుబడిదారులను తప్పుదోవ పట్టించారని అదానీపై గతంలో అమెరికాలో కేసులు నమోదయ్యాయి. అయితే, ఎస్ఈసీ దాఖలు చేసిన ఈ సివిల్ కేసును పరిష్కరించుకోవడానికి గౌతమ్ అదానీ 6 మిలియన్ డాలర్లు చెల్లించడానికి అంగీకరించినట్లు కోర్టు పత్రాలు వెల్లడిస్తున్నాయి. ఇదే కేసులో సాగర్ అదానీ కూడా 12 మిలియన్ డాలర్లు చెల్లించడానికి అంగీకరించారు. ఎల్పీజీ దిగుమతులకు సంబంధించి ఇరాన్‌పై అమెరికా విధించిన అంతర్జాతీయ ఆంక్షలను అదానీ గ్రూప్ ఉల్లంఘించిందని ఆరోపిస్తూ.. యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన 'ఆఫీస్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్' దాఖలు చేసిన కేసు కూడా తాజాగా పరిష్కరించబడింది. ఈ వివాద పరిష్కార ఒప్పందం మొత్తం 275 మిలియన్ డాలర్లకు కుదిరినట్లు తెలుస్తోంది. అదానీ గ్రీన్ ఎనర్జీతో పాటు అమెరికాకు చెందిన అజూర్ కంపెనీలు తాము ఉత్పత్తి చేసే సౌర విద్యుత్‌ను కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన 'సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా'తో గతంలో ఒప్పందం కుదుర్చుకున్నాయి. అయితే, రాష్ట్రాల విద్యుత్ పంపిణీ సంస్థలు ఎస్ఈసీఐ నుంచే విద్యుత్‌ను కొనుగోలు చేసేలా ప్రభావితం చేయడానికి గౌతమ్ అదానీ నేరుగా జోక్యం చేసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఇందులో భాగంగా అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డితో అదానీ జరిపిన సమావేశంపై కూడా అప్పట్లో తీవ్ర రాజకీయ దుమారం రేగింది. కాగా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అత్యంత సన్నిహితుడైన అదానీకి.. గతంలో అమెరికా ఎస్ఈసీ పంపిన సమన్లను జారీ చేయడానికి భారత కేంద్ర ప్రభుత్వం నిరాకరించిన సంగతి తెలిసిందే. తాజా నిర్ణయంతో అదానీ గ్రూప్‌ను చుట్టుముట్టిన అంతర్జాతీయ న్యాయ వివాదాలకు తెరపడినట్లయింది.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
మంగళవారం, మే 19, 2026

# బీఆర్ఎస్ హయాంలో 'పాలమూరు' నిర్లక్ష్యం

■ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ధ్వజం



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును తామే 90 శాతం పూర్తి చేశామంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు ముమ్మాటికీ అవాస్తవమని అచ్చంపేట ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు డాక్టర్ వంశీకృష్ణ తీవ్రస్థాయిలో ఖండించారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల సమీక్షా సమావేశం జరిగింది. అనంతరం అసెంబ్లీలోని సీఎల్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధుల మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడారు. 2015లో భూత్పూర్‌లో జరిగిన ఒక సభలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్.. తానే స్వయంగా కుర్చీ వేసుకుని కూర్చొని రెండేళ్లలో పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేస్తానని ప్రగల్భాలు పలికారని వంశీకృష్ణ గుర్తు చేశారు. తీరా పదేళ్లు దాటినా మెయిన్ కెనాల్స్, డిస్ట్రిబ్యూటరీ కాల్వలకు కనీసం అనుమతులు కూడా తీసుకురాలేకపోయారని మండిపడ్డారు. పంపులు, మోటార్లు, సర్జ్ పూల్స్ కోసం రూ.35 వేల కోట్లు కేటాయించి, పదేళ్ల కాలంలో కేవలం రూ.25 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని విమర్శించారు. ప్రస్తుత అంచనాల ప్రకారం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి కావాలంటే దాదాపు లక్ష కోట్ల రూపాయలు అవసరమవుతాయని ఆయన స్పష్టం చేశారు. పాలమూరు ప్రాజెక్టు శంకుస్థాపన చేసిన ఏడాది తర్వాత మొదలుపెట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుకు లక్ష కోట్లు ఖర్చు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం, పాలమూరు జిల్లాను మాత్రం ఘోరంగా వంచించిందని ఆరోపించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. జిల్లాలోని ప్రాజెక్టుల పురోగతిపై సీఎం పలు కీలక ఆదేశాలు జారీ చేశారని పేర్కొంటూ ఆ వివరాలను వెల్లడించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో పాటు జిల్లాలోని ఇతర పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. భూసేకరణకు అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేస్తుందని హామీ ఇచ్చారు. భూసేకరణ నిధుల విషయంలో ఎలాంటి జాప్యం జరగకుండా, రైతులకు వెంటనే చెల్లింపులు జరిగేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించినట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి నిలిచిపోయిన పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా మంత్రులు నిరంతరం సంబంధిత జిల్లా అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ వివరించారు. ఈ సమావేశంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# మెడకు రెండు పేగులు చుట్టుకున్నా.. నార్మల్ డెలివరీ

అచ్చంపేట కేర్ హాస్పిటల్ వైద్యుల అద్భుతం




**లింగాల/చ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** బిడ్డ మెడకు రెండు సార్లు గర్భ పేగు చుట్టుకుని ఉన్న క్లిష్ట పరిస్థితిలోనూ.. వైద్యులు సిజేరియన్ జోలికి వెళ్లకుండా అత్యంత విజయవంతంగా నార్మల్ డెలివరీ నిర్వహించి ప్రాణదాతలుగా నిలిచారు. అచ్చంపేటలోని కేర్ హాస్పిటల్‌లో ఈ అరుదైన ప్రసవం చోటుచేసుకుంది. లింగాల మండలంలోని మఖ్దూమ్‌పూర్ గ్రామానికి చెందిన సరిత (భర్త రాజు) గర్భం దాల్చిన రెండో నెల నుంచే అచ్చంపేట కేర్ హాస్పిటల్‌లో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ అఫ్రీన్ పర్యవేక్షణలో రెగ్యులర్ చెకప్‌లు చేయించుకుంటున్నారు. అయితే, ప్రసవ సమయానికి బిడ్డ మెడకు రెండు సార్లు పేగులు చుట్టుకుని ఉండటాన్ని స్కానింగ్‌లో గమనించారు. సాధారణంగా ఇలాంటి కేసుల్లో వైద్యులు అత్యవసరంగా సిజేరియన్ వైపే మొగ్గు చూపుతారు. కానీ, డాక్టర్ అఫ్రీన్ ఈ కేసును ఒక సవాల్‌గా స్వీకరించారు. గర్భిణికి ధైర్యం చెబుతూ, నిరంతరం పర్యవేక్షిస్తూ ఎంతో నైపుణ్యంతో శస్త్రచికిత్స అవసరం లేకుండానే సుఖప్రసవం చేయించారు. ప్రస్తుతం తల్లి, నవజాత శిశువు ఇద్దరూ పూర్తి ఆరోగ్యంతో క్షేమంగా ఉన్నారని డాక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అఫ్రీన్ మాట్లాడుతూ.. తల్లి, బిడ్డల భవిష్యత్తు ఆరోగ్యానికి సహజ ప్రసవమే అత్యంత ఉత్తమమైన మార్గమని స్పష్టం చేశారు. నేటి రోజుల్లో చిన్న చిన్న కారణాలకే సిజేరియన్లు పెరిగిపోతున్నాయని, అలా కాకుండా ప్రతి ఒక్క వైద్యుడు నార్మల్ డెలివరీలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆమె పిలుపునిచ్చారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆపరేషన్ లేకుండా నార్మల్ డెలివరీ చేసిన డాక్టర్ అఫ్రీన్‌ను, హాస్పిటల్ సిబ్బందిని బాధితురాలి కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు అభినందించారు.

# ఎస్సై పుట్ట మహేష్‌కు ఘన సన్మానం



**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్:** మండల నూతన సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా బాధ్యతలు స్వీకరించిన పి.మహేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలువురు ప్రముఖులు ఘనంగా సన్మానించారు. డీసీసీ ఉపాధ్యక్షులు కట్ట అనంత రెడ్డి, స్థానిక సర్పంచ్ చింతగాల్ల శ్రీనివాసులు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై మహేష్‌ను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదే క్రమంలో, ఉప్పునుంతలలో గతంలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఎస్సై వెంకట్‌రెడ్డిని కూడా ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయన ఉప్పునుంతల మండలంలో అందించిన సేవలను, శాంతిభద్రతల పరిరక్షణకు చేసిన కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. సన్మాన అనంతరం నూతన ఎస్సై పి. మహేష్ మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా నేటి యువత పెడదారి పట్టకుండా చూసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ శాఖ తీసుకునే ప్రతి నిర్ణయానికి, శాంతిభద్రతల పరిరక్షణకు మండలంలోని అన్ని గ్రామాల రాజకీయ నాయకులు, సర్పంచులు, గ్రామ పెద్దలు, యువకులు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన కోరారు. పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామాల ముఖ్య నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# గోశాలకు దాన బస్తాల వితరణ

**గణపురం, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద, కాకతీయుల కళాక్షేత్రమైన శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం (కోటగుళ్ళు) పరిధిలోని గోశాల గోమాతలకు గణపురం మండల కేంద్రానికి చెందిన పెద్దపల్లి రమాదేవి, విరాట్ చారి దంపతులు తమ ఉదారతను చాటుకున్నారు. తమ 37వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గోశాలలోని గోవుల కోసం వారు దాన బస్తాలను విరాళంగా అందజేశారు. వివాహ వార్షికోత్సవ సందర్భంగా ఈ దంపతులు మొదట ఆలయంలో శ్రీ భవాని సహిత గణపేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు దంపతులకు తీర్థప్రసాదాలు అందించి, శాలువాతో ఘనంగా సన్మానించి వేద ఆశీర్వచనాలు అందజేశారు.

# జనగణన, 'ఎస్ఐఆర్'పై అవగాహన

**దామెర, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండల తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. పరకాల ఆర్డీఓ నారాయణ, దామెర తహశీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, మండల పార్టీ అధ్యక్షులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రాబోయే జనగణన కార్యక్రమ ప్రాధాన్యతను వివరించడంతో పాటు, స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ అమలు ప్రక్రియపై సర్పంచులకు పూర్తిస్థాయిలో దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమిస్తాం

■ సీపీఎం నేత దేశా నాయక్
■ ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ



**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్:** కమ్యూనిస్టు ఉద్యమ ఆశాజ్యోతి, నిరుపేదల పెన్నిధి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో సమసమాజ స్థాపన కోసం నిరంతరం ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దేశా నాయక్ స్పష్టం చేశారు. మండలంలోని రాయిచెడు గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం వివరాలను సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు వెల్లడించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన దేశా నాయక్ సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని సామాజిక అసమానతలను రూపుమాపడం ఒక్క వర్గపోరాటం ద్వారానే సాధ్యమవుతుందని నమ్మి, తాను నమ్మిన సిద్ధాంతం కోసం నిస్వార్థంగా, ఉన్నతమైన విలువలతో జీవించిన మహోన్నత వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించి, దాని ద్వారా కూలీల, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలను ఉధృతంగా నడిపిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటంలోనూ, వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలోనూ ముందుండి నాయకత్వం వహించి.. భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం అలుపెరగని పోరాటం చేసిన ధీరుడు సుందరయ్య అని దేశా నాయక్ గుర్తుచేశారు. అంతటి గొప్ప నాయకుడైనప్పటికీ, ఎంపీగా ఉన్న కాలంలో అసెంబ్లీకి సైకిల్‌పై వెళ్లిన అత్యంత సామాన్య, ఆదర్శ ప్రజాప్రతినిధి అని కొనియాడారు. రానున్న కాలంలో సుందరయ్య ఆశయ సాధన కోసం, ప్రస్తుత ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై రాజీలేని సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని ఆయన పిలుపునిచ్చారు. ఈ వర్ధంతి సభలో సీపీఎం తాలూకా సీనియర్ నాయకులు శివకుమార్, సీపీఎం అచ్చంపేట పట్టణ కార్యదర్శి బి. రాములు, గ్రామ శాఖ కార్యదర్శి గౌడుగు వెంకటయ్య, ముఖ్య నాయకులు బాలయ్య, చిన్న వెంకటయ్య, నవీన్, నోముల లింగమయ్య, డీవైఎఫ్ఐ గ్రామ అధ్యక్షులు గౌడుగు రామకృష్ణ, ఉపాధ్యక్షులు మహేష్‌లతో పాటు పెద్ద సంఖ్యలో వ్యవసాయ కార్మికులు, మహిళలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
మంగళవారం, మే 19, 2026

# ఆదిలాబాద్‌లో నిప్పుల కుంపటి

- 44.6 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత!
- వడగాలుల తీవ్రతకు అల్లాడుతున్న జనం
- అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక

**ఆదిలాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఆదిలాబాద్ జిల్లాలో భానుడు భగభగలాడుతున్నాడు. రోహిణీ కార్తెకు ముందే ఎండలు ముదిరిపోవడంతో జిల్లా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సోమవారం జిల్లాలో గరిష్టంగా 44.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా, మంగళవారం కూడా అదే స్థాయి తీవ్రత కొనసాగింది. ఉదయం 8 గంటలకే మొదలవుతున్న ఎండ ప్రతాపం.. సాయంత్రం 6 గంటల వరకు శాంతించడం లేదు. దీనికితోడు తీవ్రమైన వడగాలులు తోడవడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్నం వేళల్లో ఎండ తీవ్రత తారాస్థాయికి చేరుతుండటంతో జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులన్నీ జనసంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసర పనులపై బయటకు వచ్చేవారు గొడుగులు, టోపీలు ధరిస్తూ, తలకు రుమాళ్లు చుట్టుకుంటున్నారు. ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు మజ్జిగ, లస్సీ, కొబ్బరిబొండాలు, ఇతర చల్లని పానీయాలను ఆశ్రయిస్తున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు వీలైనంత వరకు ఉదయం, సాయంత్రం వేళల్లోనే తమ పనులను ముగించుకోవాలి. మధ్యాహ్నం వేళల్లో బయటకు రాకపోవడమే మంచిది. డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండటానికి ఓఆర్ఎస్ ద్రావణం, నిమ్మరసం, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలి. జిల్లాలో రాగల మరో నాలుగు రోజుల పాటు ఎండల తీవ్రత ఇలాగే కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, వృద్ధులు, చిన్నపిల్లల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ సూచించింది.

# బడిబాటను విస్తృతంగా నిర్వహించాలి

- సర్కారు బడుల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరగాలి
- డీఈవో, ఎంఈవోల సమీక్షా సమావేశంలో కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** జిల్లాలో బడిబాట కార్యక్రమాలను విస్తృత స్థాయిలో నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్యను గణనీయంగా పెంచాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 16 నుంచి జూన్ 19 వరకు నిర్వహించనున్న బడిబాట కార్యక్రమాల పురోగతిపై జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. వి. గిరిరాజ్ గౌడ్, మండల విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు కనీసం పది శాతం పెరిగేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని అధికారులను సూచించారు. గ్రామస్థాయిలో సర్పంచులు, వార్డు సభ్యులు, మండల అధికారులు, మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులను బడిబాట కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మెరుగైన విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, సురక్షిత వాతావరణంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. గతంలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండి మూతపడిన ప్రభుత్వ పాఠశాలలను ఈ విద్యా సంవత్సరం నుంచి తిరిగి ప్రారంభిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. గ్రామాల్లో ఉన్న ప్రతి చిన్నారి బడిలో ఉండాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు సంయుక్తంగా ఇంటింటి సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ప్రభుత్వం రవాణా భత్యం అందిస్తున్నందున, అర్హులైన ప్రతి విద్యార్థికి ఈ సౌకర్యం అందేలా చూడాలన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో భవనాలకు రంగులు వేయడం, పెండింగ్ అభివృద్ధి పనులను వేగవంతం చేయడం పూర్తి చేయాలని సూచించారు. యూడైస్ నిబంధనల ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల అర్హతలు, అనుమతులు, మరియు ఫీజుల నియంత్రణ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అన్న విషయాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని డీఈవో, ఎంఈవోలను కలెక్టర్ ఆదేశించారు. అలాగే, జిల్లాలో కొనసాగుతున్న జనగణన కార్యక్రమంలో ఎన్యూమరేటర్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు గృహాల లెక్కింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలన్నారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్, ఏఎంఓ డాక్టర్ మన్మోహన్, బడిబాట కార్యక్రమ కమ్యూనిటీ కోఆర్డినేటర్ సుమా, జీసీఈవో సునీత, జిల్లాలోని 14 మండలాల ఎంఈవోలు, పలువురు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# చాపకింద నీరులా మతమార్పిళ్ల దందా

- యూపీలో భారీ నెట్‌వర్క్ ఛేదించిన పోలీసులు
- నాసిక్ ఘటన మరువక ముందే మిర్జాపూర్‌లో మరో దారుణం వెలుగులోకి
- జిమ్‌లు, ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మహిళలే లక్ష్యంగా వల..
- 10 మంది నిందితుల అరెస్ట్
- నిందితులపై గ్యాంగ్‌స్టర్ చట్టం కింద చర్యలకు సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశం

**లక్నో/మిర్జాపూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్:** దేశంలో చాపకింద నీరులా సాగుతున్న అక్రమ, బలవంతపు మతమార్పిళ్ల దందా మరోసారి కలకలం రేపింది. మహారాష్ట్రలోని నాసిక్‌లో గల ఒక మల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగినులపై బలవంతపు మతమార్పిళ్లు, లైంగిక వేధింపుల ఉదంతం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ ఘటన మరవక ముందే ఉత్తరప్రదేశ్‌లోని మిర్జాపూర్‌లో సరిగ్గా అలాంటిదే మరో భారీ మతమార్పిడి నెట్‌వర్క్‌ను పోలీసులు శ్రమించి ఛేదించారు. జిమ్‌లలో చేరే ఆధునిక యువతులు, మహిళలను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న ఈ అక్రమ దందాను బట్టబయలు చేస్తూ పోలీసులు పది మంది నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మిర్జాపూర్‌లోని ఒక ప్రముఖ జిమ్‌కు వెళ్తున్న యువతిపై, ఆ జిమ్ యజమాని మతం మారాలంటూ గత కొంతకాలంగా తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చాడు. దీంతో బాధితురాలు ధైర్యం చేసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ నయా దందా వెలుగు చూసింది. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని లోతుగా విచారించిన పోలీసులకు విస్తుపోయే నిజాలు తెలిశాయి. ఇది కేవలం ఒక జిమ్‌కు పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా దీని వెనుక ఒక పెద్ద నెట్‌వర్క్ పనిచేస్తోందని నిఘా వర్గాలు గుర్తించాయి. వివిధ జిమ్‌లు, సోషల్ మీడియా వేదికల ద్వారా దాదాపు 50 మందికి పైగా మహిళలను టార్గెట్ చేసి ఈ ఆపరేషన్ నడిపినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ముఠాలో 'సన్నో' అనే మహిళ అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈమె ముందుగా లగ్జరీ జిమ్‌లలో సభ్యురాలిగా చేరి, అక్కడకి వచ్చే ధనిక, మధ్యతరగతి యువతులతో అత్యంత సాన్నిహిత్యంగా పరిచయం పెంచుకుంటుంది. ఆ తర్వాత మెల్లగా తన స్నేహితులంటూ పలువురు ముస్లిం యువకులను వారికి పరిచయం చేస్తుంది. మరికొందరు నిందితులు ఇన్‌స్టాగ్రామ్‌లో యువతులకు ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపి, వారితో నిరంతరం చాటింగ్ చేస్తూ మతమార్పిడి వైపు ఆకర్షితులయ్యేలా 'బ్రెయిన్ వాష్' చేస్తారని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లలో వందలాది మంది స్థానిక మహిళల ఫోటోలు, రహస్య వీడియోలు, ఆడియో చాటింగ్‌లు లభ్యమవ్వడం ఈ నెట్‌వర్క్ తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ వ్యవహారం ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దృష్టికి వెళ్లడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. మహిళల భద్రత విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేస్తూ, పట్టుబడిన నిందితులపై కఠినమైన 'గ్యాంగ్‌స్టర్ చట్టం' కింద కేసులు నమోదు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ కేసులో ఇప్పటివరకు 10 మంది కీలక సూత్రధారులను అరెస్ట్ చేశామని, పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం ముమ్మర దర్యాప్తు సాగుతోందని మిర్జాపూర్ పోలీస్ అధికారులు వెల్లడించారు.

# వృద్ధురాలికి 'మై వేములవాడ ట్రస్ట్' చేయూత



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సన్నిధిలో దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్న ఓ వృద్ధురాలికి 'మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్' ఆసరాగా నిలిచింది. నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం... నిజామాబాద్ జిల్లా భీంగల్ ప్రాంతానికి చెందిన జంబుక రాజలింగు (55) అనే వృద్ధురాలు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చింది. మానసిక వేదనతో ఆలయ ప్రాంగణంలో ఏడుస్తూ కూర్చున్న ఆమెను అక్కడే విధి నిర్వహణలో ఉన్న హోంగార్డు పద్మ గమనించారు. వెంటనే స్పందించిన హోంగార్డు, సదరు వృద్ధురాలి వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమెను చేరదీసేందుకు ఎవరూ లేరని గ్రహించి, వృద్ధాశ్రమానికి పంపించాలనే ఉద్దేశంతో 'మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్' ప్రతినిధులకు సమాచారం అందించారు. హోంగార్డు ఇచ్చిన సమాచారంతో స్పందించిన ట్రస్ట్ నిర్వాహకులు మధు, మహేష్‌లు వెంటనే అక్కడికి చేరుకుని వృద్ధురాలిని వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ అనుమతితో, పట్టణ పోలీసుల సమక్షంలో ఆమెను సురక్షితంగా ఓబులాపురంలోని 'అమ్మ అనాథ శరణాలయానికి' తరలించినట్లు ట్రస్ట్ నిర్వాహకులు వెల్లడించారు. ఆపదలో ఉన్న వృద్ధురాలిని ఆదుకోవడంలో చొరవ చూపిన హోంగార్డు పద్మను, ట్రస్ట్ నిర్వాహకులను ఎస్ఐ శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ మానవతా కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, హోంగార్డు పద్మతో పాటు ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు 'ముఖ్యమంత్రి సహాయనిధి' కొండంత అండ




- విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ, రూరల్ మండలాలకు చెందిన మొత్తం 43 మంది అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన రూ.14 లక్షల 15 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండలాల వారీగా లబ్ధిదారులకు అందిన సహాయాన్ని విప్ ఆది శ్రీనివాస్ ఈ సందర్భంగా వివరించారు. పట్టణ పరిధిలోని 30 మంది అర్హులైన లబ్ధిదారులకు రూ.9,83,000 విలువైన చెక్కులను అందజేశారు.